క్లుప్తంగా

విస్తృతంగా తనిఖీలు

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక బలగాలు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా కార్లు, ద్విచక్ర వాహనాలు, క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో ఎలాంటి నగదు పట్టుబడలేదు.

ఈపీఎఫ్ పొదుపు సాధనం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈపీఎఫ్ శ్రామిక శక్తి కోసం ఒక పొదుపు సాధనమని హైదరాబాద్ మాదాపూర్ పీఎఫ్ కార్యాలయంలోని మహబూబ్‌నగర్ నోడల్ అధికారి మఠం రాజశేఖర్ అన్నారు. ప్రతి నెల జిల్లాలోని పీఎఫ్ ఖాతాదారులు, పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేయడంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలమూరు అర్బన్ బ్యాంకులో నిధి ఆప్‌కే నిక్కట్–2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాదారుల్లోని పేరు, పుట్టిన తేదీ, యూఎన్‌ఏ నంబర్ బదిలీ, మెర్జ్ చేయడం లాంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సోషియల్ సెక్యూరిటీ అసిస్టెంట్ వీఎస్.హనుమాన్, అఖిల్, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగ, మాదిగ ఉప కులాల 29 సంవత్సరాల చిరకాల స్వప్నం అయిన ఎస్సీ వర్గీకరణను సాధించుకునేందుకు వచ్చేనెల 18న హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణయ్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో విశ్వరూప సభ కరపత్రాలను విడుదల చేశారు. 30న పాతపాలమూరులో ఎమ్మార్పీఎస్ జిల్లా సన్నాహక సదస్సుకు రథయాత్ర ద్వారా మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణయ్య, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

హన్వాడ: ద్విచక్రవాహన ప్రమాదంలో ఎర్ర రాజమ్మ(45) మృతికి కారణమైన వ్యక్తిపై శుక్రవారం హన్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్లాబాద్‌కు చెందిన శివకుమార్ జిల్లాకేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వేపూర్ శివారులో.. అదేసమయంలో కూలీపనులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఎర్ర రాజమ్మ బైక్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలైంది. అదేరోజు (గురువారం) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. కాగా ఆమె కుమార్తె రామేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. రాజమ్మ బంధువులు హన్వాడలోని ఠాణా వద్ద పరిహారం ఇవ్వాలంటూ ప్రధాన రహదారిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజమ్మ భర్త సాయన్న రెండేళ్ల క్రితం మరణించారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారని స్థానికులు తెలిపారు.

టికెట్ ఖరారుతో సంబరాలు



జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ టికెట్ అనిరుధ్‌రెడ్డికి ఖరారు కావటంతో నియోజకవర్గ కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ఆయన అనుచరులు సంబరాలు నిర్వహించారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు బాణాసంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్



పీఓలు, ఏపీఓలతోపాటు కూర్చుని శిక్షణ పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

జడ్చర్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ తొలిరోజు శుక్రవారం ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు గదుల్లో వారికి శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గానికి 700మందిని పీఓలు, ఏపీఓలుగా నియమించగా వీరిని నాలుగు గ్రూపులుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మొదటి గ్రూపునకు శిక్షణ ఇచ్చారు. మొత్తం 180మందికి గానూ 175మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు ఇచ్చిన రెండవ గ్రూపు శిక్షణలో 180 మందికి 168 మంది హాజరయ్యారు. మిగిలిన వారికి శనివారం రెండు గ్రూపులుగా శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణను జడ్చర్ల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు పర్యవేక్షిస్తున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

పీఓలు, ఏపీఓలు ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ సూచించారు. శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేసుకోవాలని అన్నారు. శిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ పీడీ యాదయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్, నోడల్ అధికారి మంజుల ఉన్నారు.

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోండి



సూరారంలో అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న పేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోయిల్‌కొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం మండలంలోని సమస్యాత్మకమైన మణికొండ, కేశ్వాపూర్, గార్లపహాడ్, మల్కాపూర్, సూరారం, మల్లాపూర్, కొత్లాబాద్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ కేంద్రాలలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. సమస్యలు సృష్టించే వాళ్లు ఉంటే ముందస్తుగా బైండోవర్ చేయాలని పేర్కొన్నారు. కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని అర్హులు వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలల్లో అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆర్డీఓ రాంచందర్, తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీఓ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గండేడ్: అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ నాగలక్ష్మి పేర్కొన్నారు. గ్రామాల్లో బీఎల్‌ఓల దగ్గర లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధర్మ సమాజ్ అభ్యర్థిగా జంగన్న

భూత్పూర్: ధర్మ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా జంగన్న ముదిరాజ్‌ను ఎంపిక చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు రాములు మహారాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. కర్వెనకు చెందిన ఆయనను గెలిపించాలని ఆయన కోరారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మున్నూర్ శ్రీనివాసులు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి గురువారం రాత్రి శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీలు ఇంద్రయ్యసాగర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామంలో బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. మండ్ల రాజేందర్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు రూ.10వేలు, అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తెలుగు సూరి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్, విజయకుమార్‌రెడ్డి, కృష్ణయ్య, మన్నెంకొండ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో స్టేజీ పై మద్యం సీసా

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మందుబాబులు అడ్డాగా మార్చుకుంటున్నారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వందలాది మంది విద్యార్థులు చదువుకునే పాఠశాలలో మద్యం సేవించి అక్కడే సీసాలు పగులగొడుతున్నారని అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ తెలంగాణ కల్పతరువు



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

నవాబుపేట: బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజల పాలిట కల్ప తరువుగా మారిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం కొండాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ దామోదర్‌చారి, నాయకులు పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. ప్రజలు తమను మరోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, కేసీఆర్‌కే జై కొడుతున్నారని వివరించారు. అదేవిధంగా మల్లారెడ్డిపల్లి నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: ఎన్నికల్లో ఇతర పార్టీలకు ఓటేస్తే కర్ణాటక ప్రజల్లాగా మోసపోతామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పల్లుతండా, కల్లేపల్లి గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పిరిబచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలకంగా పనిచేయాలి

అడ్డాకుల: ఎన్నికలు ముగిసే వరకు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచాలలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల మాయ మాటలను నమ్మవద్దని ప్రజలను చైతన్యం చేయాలని తెలిపారు. పార్టీ మేనిఫెస్టోను ప్రతి ఇంటికి చేర్చి సీఎం కేసీఆర్‌కు అండగా ఉండే విధంగా ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, తిరుపతిరెడ్డి, రంగన్నగౌడ్, సుజాత, బాలరాజు, మహేష్, వివిధ గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం జోరుగా సాగింది. ఆయా కార్యక్రమాల్లో మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. హన్వాడ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ శుక్రవారం లింగన్నపల్లిలో బూత్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోయిల్‌కొండ మండలంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మెగులయ్య, నారాయణ, నాయకులు పాల్గొన్నారు. మహమ్మదాబాద్ పరిధిలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పర్యటించారు. అదేవిధంగా ఆయా చోట్ల పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

గద్వాల నుంచే మొదటి విజయం



స్టేషన్ మహబూబ్‌నగర్: జనాభా దామాషా ప్రకారం ఏ నియోజకవర్గంలో ఎక్కువ జనాభా ఉంటే ఆ సామాజిక వర్గం చట్టసభల్లోకి వచ్చే దిశగా అడుగులు వేయాలనే బీసీ సమాజ్ ప్రధాన డిమాండ్‌లో మొదటి విజయం గద్వాల నుంచే జరగడం హర్షించదగ్గ పరిణామమని ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గద్వాల ఎమ్మెల్యే స్థానాన్ని వదులుకొని బీసీలకు ఇవ్వడానికి సిద్ధపడ్డ మాజీ మంత్రి డీకే అరుణకు ధన్యవాదాలు తెలిపారు. గద్వాల నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీసుకొని తెలంగాణలోని ఇతర స్థానాల్లోనూ బీసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ సత్యం, జిల్లా కోకన్వీనర్లు రాజేందర్‌గౌడ్, ఆర్.సత్యం, దేవరకద్ర కన్వీనర్ శేఖర్ పాల్గొన్నారు.

నాణ్యతగా నిర్మించాలి

కోయిల్‌కొండ: మండలంలో మంజూరైన గ్రామపంచాయతీ భవనాలను నాణ్యతతో నిర్మించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపూర్‌లో నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

16మంది బైండోవర్

జడ్చర్ల టౌన్: ఎన్నికల సందర్భంగా మండలంలోని 16మంది బెల్టుషాపుల వ్యాపారులను శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలియజేశారు. అదేవిధంగా కిష్టంపల్లిలో 7లీటర్ల మద్యం పట్టుబడినట్లు వివరించారు.

తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: నవంబర్ 2లోగా సంక్షేమ పథకాల డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని రేవంత్‌రెడ్డి ఈసీని కోరితే దానిని బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరన్నారు. 2017లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రైతులకు ఉచితంగా ఎరువులు అందజేస్తానని ప్రకటించిన కేసీఆర్ ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో 14 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలవనుందని అన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది కాంగ్రెస్

తమను ఓడిస్తే నష్టం ఏమిలేదు ఇంట్లో కూర్చుంటామని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను బ్లాక్‌మెయిలింగ్ చేసే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పుడున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, గమనించిన తనను చూసి ఓట్లు వేయమని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు సిరాజ్ ఖాద్రీ, మల్లు నరసింహారెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమానికి ఆరు గ్యారెంటీలు

మహబూబ్‌నగర్ రూరల్: అందరి సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీ పథకాలను పొందుపర్చిందని అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి అన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఫతేపూర్‌లో వారు పర్యటించారు. పథకాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, చెన్నయ్య, భాస్కర్, నరేష్‌గౌడ్, రాజుగౌడ్, తిరుపతయ్య, కడెం రఘు, నాగయ్య పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారు

భూత్పూర్: బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని, ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని డీసీసీ అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏవీఆర్ తండా (భట్టుపల్లి తండా), ఎల్కిచర్లకు చెందిన వందకు పైగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే భట్టుపల్లి తండాను ఏవీఆర్ తండాగా మార్చడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో చేపల విక్రయం



రోడ్డుపై విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

బాలానగర్: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతలో చేపల విక్రయం చేసే వ్యాపారులు ఒకరికంటే ఒకరు ముందుకు వచ్చి నడిరోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సుమారు 50 ఫీట్ల వెడల్పుతో నాలుగు వరుసల బీటీ రోడ్డు ఉండగా ఒకరితో ఒకరు పోటీపడి మరీ దుకాణాలను రహదారి మధ్యకు తీసుకువచ్చారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. చేపలు కొనేందుకు వచ్చిన వారు సైతం ద్విచక్ర వాహనాలను రోడ్డులోనే నిలపడంతో అటు తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, ఈజీఎస్, మహిళా సమాఖ్య, మండల ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వంటి కార్యాలయాలకు వెళ్లే వారికి దారి లేకుండా పోయింది. దీంతో పలువురు వాహనదారులు చేపల విక్రయదారులతో గొడవపడ్డారు. విషయంపై కార్యదర్శిని సంప్రదించగా బీటీరోడ్డు చివరలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని విక్రయదారులకు పలుమార్లు సూచించినా అలాగే వ్యవహరిస్తున్నారని అన్నారు. వచ్చే వారం నుంచి మార్కింగ్ ఏర్పాటు చేయిస్తామన్నారు.

హస్తం పార్టీకి ఓటేస్తే చేటే



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆ పార్టీకి ఓటేస్తే చేటేనని అన్నారు. ప్రజానీకానికి అండగా నిలిచిన బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలన్నారు. శుక్రవారం పోతన్‌పల్లి, మాచన్‌పల్లి, రామచంద్రాపూర్ గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనతో కర్ణాటకలో చీకట్లు అలుముకున్నాయని, కరెంట్ సమస్యలపై సబ్‌స్టేషన్లలో మొసళ్లను వదిలి నిరసన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ కె.అనిత, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, పాల్గొన్నారు. మంత్రి గెలుపు కోసం ఆయన కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే ప్రతిపక్ష నాయకుల ఫోన్లు నవంబర్ 30 తర్వాత పనిచేయవని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం 13వ వార్డు బండమీదిపల్లిలో ప్రచారంలో ఆయన మాట్లాడారు. 'ఆ గట్టునుంటావా నాగన్న.. ఈ గట్టునుంటావా..' అనే సినిమా పాటలాగే ఒకవైపున బీఆర్‌ఎస్ ఉండగా.. మరోవైపున కాంగ్రెస్ ఉందని, ఏ వైపున ఉండాలో ఓటర్లే నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ ఆంజనేయగౌడ్ మహబూబ్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రైతు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలికి చెందిన పలువురు మంత్రి సమక్షంలో పార్టీలోచేరారు. అంతకుముందు బీఆర్‌ఎస్ కార్యాలయంలో పీసీసీ అధికార ప్రతినిధి ఆశిరెడ్డి, బీజేపీ నాయకుడు జయనంద్ మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

'ఎన్నికల' విధుల్లో అధికారులు

- కార్యాలయాల వద్ద సామాన్యుల పడిగాపులు



గండేడ్ తహసీల్దార్ కార్యాలయం

గండేడ్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం అంతా కూడా ఎన్నికల షెడ్యూలు కార్యక్రమాల్లో నిత్యం బిజీ బిజీగా ఉంటున్నారు. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతూ తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారికి ప్రయాసలు తప్పడం లేదు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వచే వారితో పాటు రిజిస్ట్రేషన్లకు వచ్చే వారికి కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని వెన్నాచేడ్, పగిడ్యాల్, సల్కర్‌పేట్, కొంరెడ్డిపల్లి, రుసుంపల్లి, చిన్నవార్వాల్ , మొకర్లాబాద్, గాధిర్యాల్, నంచర్ల, జూలపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఆయా పనుల మీద తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో దాదాపు నెల రోజుల ముందు నుంచే ఓటరు లిస్టు నమోదు, మార్పులు, చేర్పులు వంటివాటిపై అధికారులు కసరత్తు చేపట్టారు. తరచుగా బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతర అధికారులతో సమావేశాలు జరుగుతున్నాయి. ఇటీవలే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో ప్రతి రోజు ఏదో ఒక మీటింగ్ ఉంటోంది. ఈ నేపథ్యంలోనే తహసీల్దార్ కార్యాలయం వారు అందుబాటులో ఉండడం లేదు.

సమావేశాలకు పక్కా జిల్లాకు...

గండేడ్, మహమ్మదాబాద్ మండలాలు కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో మహబూబ్‌నగర్‌లో కలిశాయి. కానీ అసెంబ్లీ సెగ్మెంట్ పరిగి కిందకు వస్తుంది. దీంతో ఏ సమావేశం జరిగినా అధికారులు వికారాబాద్ జిల్లా పరుగెత్తాల్సి వస్తోంది. ఒక్కోసారి రెండు జిల్లాల సమావేశాలకు సైతం వెళుతున్నారు. దీంతో తరచుగా కార్యాలయం మూత పడుతోంది. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అందరూ వెళ్లడంతో... కార్యాలయం తెరిచినా అందరి అధికారుల గదులు మాత్రం తాళాలు వేసి ఉన్నాయి. సాయంత్రం సమావేశానంతరం తహసీల్దార్ పరిగి నుంచి నాలుగు గంటలకు వచ్చి పలు కార్యకలాపాలు నిర్వహించారు. కాగా అంతకు ముందే వేచిచూసి పలువురు వెనుదిరిగారు. విషయంలో తాము ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని పలువురు అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ల విషయంలో ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. సమయం దొరికినపుడల్లా పెండింగ్ పనులు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమావేశాలకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామాల వారీగా జూనియర్ అసిస్టెంట్లను నియమించాం. వారు ధ్రువీకరించిన ఆధారంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నాం.

– నాగలక్ష్మి, తహసీల్దార్, గండేడ్